క్లుప్తంగా

గాలిగోపురం పరిశీలన



గాలిగోపురాన్ని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ఉలవపాడు: గాలి గోపురానికి పగుళ్లు అని సాక్షిలో ఆదివారం ప్రచురించిన కథనానికి దేవాదాయ శాఖ అధికారులు స్పందించారు. గుంటూరు డీసీ ఆదేశాల మేరకు కారుమంచి ఈఓ వరదారెడ్డి, డీఈ శ్రీనివాసరావు గాలిగోపురంలోని పగుళ్లను పరిశీలించారు. కింద నుంచి పై వరకు ఎక్కడ పగుళ్లు వచ్చాయో తెలుసుకొని మరమ్మతులు చేయడానికి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలియజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వాసు మాత్రం హాజరు కాలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పామూరు రోడ్డులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఆ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు. సోమవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రశాంతినగర్, పామూరు రోడ్డులోని ఇండస్ట్రియల్ జియో టైల్స్, హెరిటేజ్ మిల్క్‌లైన్, ఐటీఐ కాలేజీ, ఎస్‌ఆర్‌ఐ మిల్క్‌లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజల గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

22 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లు

కనిగిరి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు అధార్ ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. గుడిపాడు, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు, పొలవరం , తక్కెళ్లపాడు, పునుగోడు గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ కేంద్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

రేపు ప్రజాదర్బార్

పామూరు: ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో 22వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బొలినేని సురేష్ తెలిపారు. సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు ఇవ్వవచ్చన్నారు. ప్రజాదర్బార్‌కు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఇంటింటికీ వైద్యం

వలేటివారిపాలెం: మండలంలోని పోలినేని పాలెం గ్రామంలో ఇంటింటికీ వైద్యం కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ మణిదీపిక వలేటివారిపాలెంలో ఆదివారం ఏర్పాటు చేశారు. పోలినేనిపాలెం గ్రామంలో 27 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులను పరీక్షించి రక్తం తక్కువ శాతం ఉన్న మహిళలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలినేనిపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఇంటి దగ్గర ఉన్న వృద్ధులకు, వికలాంగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఏఎన్‌ఎమ్‌ల ద్వారా ప్రతి వారం పరీక్షలు చేయించుకోవాలని, అలాగే ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు చేయించుకోవాలని సూచించారు. కాన్పులు అనంతరం 108 ద్వారా తల్లీ బిడ్డను ఇంటి దగ్గరకు చేర్చి తల్లికి 1000 రుపాయలు డబ్బులు ఇస్తామని తెలిపారు.

ప్రభుత్వ భవనాల్లో

భయం..భయం





పెచ్చులూడిన ఐసీడీఎస్ కార్యాలయ భవనం

- వారం రోజులుగా విస్తారంగా వర్షాలు
- పెచ్చులూడిన భవనాల కింద విధి నిర్వహణ

కనిగిరి రూరల్:

పట్టణంలోని పలు ప్రభుత్వ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వారం రోజులుగా వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న ఎడతెరపి లేని నాన్పుడు వర్షాలకు శ్లాబులు, గోడలు ఊరుస్తుండటంతో ఉద్యోగులు విధి నిర్వహణకు భయాందొళన చెందుతున్నారు. నిత్యం వందలాది మంది రాకపోకలతో కళకళలాడే కార్యాలయాలు కావడంతో భవనాలు కూలితే ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని అధికారులు భయభ్రాంతులకు గురౌతున్నారు. కొన్ని కార్యాలయ భవనాలకు తాత్కాలిక మరమ్మతులతో జీవం పోయవచ్చు.. మరికొన్ని పూర్తి శిథిలావస్థకు చేరి దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పట్టణంలోని పాత తహసీల్దార్ భవనం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం అక్కడ కార్యకలాపాలు ఏం జరగనప్పటికీ రికార్డు గదులు అక్కడే ఉన్నాయి. అంతేగాక ప్రభుత్వ కార్యాలయ సముదాయాల రహదారిలో ఉండటంతో పొరపాటున కూలితే భారీ నష్టం జరుగుతుంది. ఇక నిత్యం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు రాకపోకతో సందడిగా ఉంటే ఐసీడీఎస్ కార్యాలయం భవనం పూర్తిగా దెబ్బతింది. భవనం పెచ్చులూడి శ్లాబులో నుంచి, ఫ్యాను పాయింట్లలో నుంచి నీరు కారుతూ ప్రమాదభరితంగా ఉంది. దీంతో ఆ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం కూడా పాత భవనంలో నిర్వహిస్తున్నారు. ఇది కూడా శిథిలావస్థకు చేరింది సబ్ రిజిష్టర్ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలిక చర్యలు చేపట్టి విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని అనేక ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరినా వేరే గత్యంతరం లేక అదే భవనాల్లో విధులు నిర్వహిస్తూ దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులాగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



టార్పాలిన్ పట్టా కప్పి తాత్కాలిక చర్యలు చేపట్టిన సబ్ రిజిష్టర్ కార్యాలయ భవనం



శిథిలావస్థలో ఉన్న పాత తహసీల్దార్ భవనం

ఆరోగ్యకర ఆహారం అందించడమే లక్ష్యం

టంగుటూరు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకర ఆహారం అందించడమే లక్ష్యమని ప్రకృతి వ్యవసాయాధికారి టి.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మర్లపాడులో ఐసీఆర్పీ, మహిళా రైతు తాళ్లూరి హరిత ఆధ్వర్యంలో 200 లీటర్ల దశపర్ణి కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇలా తయారుచేసుకున్న కషాయాన్ని అన్ని పంటల కాలంలో రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల లద్దె పురుగుతో పాటు తెగుళ్లను కూడా నివారించవచ్చన్నారు. మర్లపాడు, కందులూరు గ్రామాల్లో రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించి కషాయాల వైపు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. ప్రకృతి సేద్యంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించవచ్చని సూచించారు. అనంతరం గ్రామంలోని రైతులతో పంటలపై వచ్చే తెగుళ్లు, చీడపీడలను నివారించడానికి ఎటువంటి రసాయనాలు వాడకుండా కేవలం స్వయంగా మనమే ప్రకృతి ద్వారా లభించే ఆకులు, ఆవు పేడ, ఆవు మూత్రం ద్వారానే తక్కువ ఖర్చుతో కషాయాలను తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కొణిజేడు యూనిట్ ఇన్‌చార్జి వెంకట్రావు, ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, త్రివేణి, హరిత, కవిత, జ్యోత్స్న, శృతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.



దశపర్ణి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి విజయలక్ష్మి తుమ్మలపూడి

వైభవంగా అభిషేకోత్సవం, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



అభిషేకోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించిన డీఏ బకాయిలు, మధ్యంతర భృతి ప్రభుత్వం వెంటనే మంజూరుచేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ట్రెనింగ్ మండలకేంద్రాల్లోనే నిర్వహించాలన్నారు. హైస్కూళ్లలోని సబ్జెక్ట్ టీచర్ల ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.వెంకటరావు, పాదుషా, యూనియన్ నాయకులు వేమనారాయణ, శ్రీనివాసులురాజు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల సురేష్, తిరుపతయ్య, వై.వి.సుబ్బారావు, మదన్‌మోహన్ పలువురు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకుని మృతి



మృతుడు మంకాల సత్యనారాయణశర్మ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మంకాల సత్యనారాయణ శర్మ(60) ఆదివారం ఇంటివద్ద గుండెపోటుతో మృతిచెందారు. ఆలయ అర్చక, ప్రధాన అర్చకులుగా సత్యనారాయణశర్మ గత సుమారు 40 ఏళ్లకు పైగా స్వామి కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఈసందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆయన ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు రూ.25 వేల సాయం చెక్కును అందజేశారు. కొమ్మినేని వెంకట్రావు, ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం



ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

కొండపి: మండలంలోని పెట్లూరు సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడటంతో మంటలు చెలరేగి సాంకేతిక లోపం తలెత్తిందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుంచాల కోటయ్య తెలిపారు. దీంతో పెట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పెట్లూరు, కోయవారిపాలెం, దాదానాయుడుపాలెం, చౌటపాలెం, గుర్రపడియ, మూగచింతల, తాటాకులపాలెం, చిన్నకుండ్లగుంట, పోలిరెడ్డి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. వెంటనే కొండపి సబ్‌స్టేషన్ నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్నామని పేర్కొన్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

- వర్షం పడితే నరకమే..
- కాలువల నుంచి బయటకు వస్తున్న మురుగు

ఉలవపాడు: అధ్వానంగా ఉన్న డ్రైనేజీలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్న వర్షం పడినా మురుగు నీరు రోడ్లపై, ఇళ్లలోకి వచ్చేస్తోంది. మండల కేంద్రమైన ఉలవపాడు అంబేడ్కర్ నగర్, కృష్ణ నగర్, హైస్కూల్ సంఘం, రిజర్వు కాలనీల్లో ఈ దుస్థితి నెలకొంది. గత కొంత కాలంగా డ్రైనేజీలులు తీయకపోవడం, మట్టి, బాటిళ్లు, నీటితో పూడి పోవడం వలన ఈ సమస్య వస్తోంది. మెయిన్‌రోడ్‌లో డ్రైనేజీ పరిస్థితి దారుణంగా ఉంది. ఎవరకి వారు వారి దుకాణాల ముందు మట్టి తోలించడంతో కూరుకుపోతోంది. తాత్కాలికంగా ఇటీవల కొంత మట్టిని తీసినా పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో పరిస్థితి దారుణంగా ఉంది. గత వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో డ్రైనేజీల నుంచి మురుగు బయటకు వస్తోంది. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వలన డ్రైనేజీలు అధ్వానంగా మారాయని ప్రజలు వాపోతున్నారు.

పరిశుభ్రం చేయండి సార్..

గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. మురుగు బయటకు రావడం వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీ వాసులు వాపోతున్నారు. జ్వరాలు అధికంగా వస్తున్నాయని కాల్వలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలని కోరుతున్నారు. సిమెంట్ రోడ్లపై కూడా నీరు నిలబడుతున్నాయని తెలిపారు.



కాలువకు అడ్డు పడిన సీసాలు



వర్షం పడితే మురుగు బయటే..



కాలువ నుంచి బయటకు వస్తున్న మురుగు



ఇళ్లలోకి చేరుతున్న మురుగు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కందుకూరు రూరల్: పల్లె పండుగ.. పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పందలపాడు, కోవూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. పందలపాడు పంచాయతీలో రూ.10.05 లక్షలు, కోవూరు పంచాయతీలో రూ.24.45 లక్షలతో నూతన సీసీ రోడ్లు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ పి.రత్నజ్యోతి, తహసీల్దార్ ఇక్బాల్, మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, నాయకులు కూనం సుబ్బారెడ్డి, కంజుల వెంకటరామిరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, హరిబాబు, నాదెళ్ల వెంకటరమణయ్య, మాధవరావు, రామారావు, రవికుమార్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన మండల కమిటీ

లింగసముద్రం: స్థానిక కేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మండల నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా వై.రామచంద్రయ్య, అధ్యక్షుడుగా ఎస్.సూర్యనారాయణ, సహాధ్యక్షులుగా ఆర్.వెంకటక్రిష్ణ, ఎస్.శాంతకుమారి, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకరరావు, కోశాధికారిగా కె.మహేంద్ర, కమిటీ సభ్యులు ఎం.లక్ష్మమ్మ, సీహెచ్ సతీష్, సీహెచ్ రాజేష్, ఏ.సాంబయ్య, ఎం.కొండయ్య, పి.భాస్కర్, ఎంఎల్ నరసింహారావు, ఆడిటర్‌గా కె.ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.సూర్యనారాయణ, టి.సుధాకర్, టి.సరోజిని, ఎంఎం సుధాకరరావు, డి.మాధవరావును ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీతో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడుగా కిలారి వెంకటేశ్వర్లుతో ప్రమాణం చేయించారు. హెచ్ఎంలు యు.మాధవరావు, కె.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడుకు చేరుతున్న వరదనీరు



జలకళ సంతరించుకున్న రాళ్లపాడు ప్రాజెక్టు

-16.3 అడుగులకు చేరిన నీటిమట్టం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో ప్రాజెక్టుకు వరదనీరు చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 16.3 అడుగులకు చేరింది. శనివారం, ఆదివారంలో ఎగువ ప్రాంతమైన దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో భారీ వర్షం కురవడంతో మన్నేరు, పిల్లాపేరు, ఉప్పుటేరు ద్వారా 1300 నుంచి 1500 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు జేఈ చంద్రమౌళి చెప్పారు. వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 21 అడుగులు కాగా 16.3 అడుగుల నీరు చేరినట్లు చెప్పారు. ప్రాజెక్టు నుంచి మూడు భారీ మంచినీటి పథకాలకు నీరు సరఫరా అవుతున్నట్లు తెలిపారు.